క్లుప్తంగా

విద్యార్థులు ఇంటి దగ్గర సైతం చదువుకోవాలి



ఎల్లారెడ్డి: విద్యార్థులు ఇంటి వద్ద సైతం బాగా చదవాలని కళ్యాణి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ అన్నారు. ఆదివారం పాఠశాల పరిధిలోని రత్నాపూర్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి వారు చదువు తీరును పరిశీలించారు. విద్యార్థులు పాఠశాలలోనే కాకుండా ఇంటి వద్ద సైతం చదువుకోవాలని ప్రిన్సిపల్ అన్నారు.

కాశీ నృత్యోత్సవంలో జిల్లా కళాకారులు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన సనాతన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కాశీ, అయోధ్య పట్టణాల్లో విశ్వనాథుని సన్నిధిలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి 200 మంది నృత్య కళాకారులు, 15 మంది నృత్యగురువులతో వారం పాటు జాతీయ నృత్యోత్సవం నిర్వహించినట్లు సంస్థ నిర్వాహకుడు మాలోత్ నవీన్‌కుమార్ తెలిపారు. జిల్లా నుంచి 40 మంది పాల్గొనడం విశేషమన్నారు.

'రైతులకు అందుబాటులో ఉంటా'



బిచ్కుంద(జుక్కల్): రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్ల కవితాప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో రైతులకు పంట ఉత్పత్తులు ఆరబెట్టుకోడానికి ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేస్తామని, మార్కెట్ కమిటీకి ఆదాయం వచ్చే విధంగా చూస్తానని అన్నారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సహకారంతో మార్కెట్ కమిటీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. వైస్ చైర్మన్ శంకర్ పటేల్, 16 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, పుల్కల్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గంగాధర్, నాగ్‌నాథ్, రవి పటేల్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకుడు



పిట్లం(జుక్కల్): ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో పిట్లంకు చెందిన ఇమ్రోజ్ జుక్కల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇమ్రోజ్ హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో కలవగా సీఎం అభినందనలు తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని సీఎం సూచించినట్లు ఇమ్రోజ్ తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి కోసం లింగంపేట గ్రామానికి చెందిన పలువురు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, సంఘం అధ్యక్షుడు దూరిశెట్టి అశోక్ మాట్లాడారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ రూ. 51 వేలు, కటిక గోపి రూ.22,116, అంకం బాల్‌రాజు రూ. 11,116 విరాళాలుగా అందజేసినట్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన పనుల పరిశీలన

బాన్సువాడ రూరల్: కోనాపూర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన పనులను ఆదివారం మండల దళిత నాయకులు గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గాండ్ల బాగయ్య, రాజేశ్వర్‌గౌడ్, దళిత నాయకులు నర్సింహులు, గైని రవి, మన్నె చిన్న సాయిలు, బేగరి సాయిలు, శివయ్య, గంగాధర్, గైని రాములు, పాపయ్య పాల్గొన్నారు.

కూరగాయల సాగుకు మొగ్గు

- మెలకువలతో లాభాలు సాధించవచ్చంటున్న రైతులు
- ఆదర్శంగా నిలుస్తున్న వైనం



బీరకాయ పంట సాగు



బస్వన్నపల్లిలో కాకరకాయ పంటను సాగు చేస్తున్న సంతోష్

రాజంపేట: రైతులు సాధారణంగా వరి, మొక్కజొన్న వంటి పంటలు పండిస్తారు. వరి పంట ఎకరానికి 30 నుంచి 40 బస్తాలు పండిస్తే 60 నుంచి 70 వేల రూపాయల వరకు మాత్రమే సంపాదిస్తారు. కానీ బస్వన్నపల్లి యువ రైతులు వినూత్న ఆలోచనలతో కూరగాయల పంటలు పండిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. బస్వన్నపల్లి గ్రామానికి చెందిన గర్ష సంతోష్ అనే యువ రైతు 4 గుంటల భూమిలో షేడ్‌నెట్ షెడ్ వేసి అందులో కాకరకాయ వంటి పంట సాగు చేస్తున్నారు. షేడ్‌నెట్ షెడ్ వేయడానికి రూ.60 నుండి 70 వేల వరకు ఖర్చయింది. దీంట్లో 5 సంవత్సరాల వరకు వివిధ రకాల పంటలు పండించవచ్చు. ప్రస్తుతం తాను కాకరకాయ పంటను సాగు చేస్తున్నట్లు రైతు తెలిపారు. ఒక టన్ను వరకు కాకరకాయ పంట దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. పంట వేయడానికి పెట్టుబడి రూ.20 నుంచి 30 వేల వరకు ఖర్చు కాగా పంట పూర్తి అయ్యే వరకు రూ.లక్ష వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. పంటలో మెలకవలు పాటిస్తూ అధిక లాభాల ఆర్జించవచ్చని అంటున్నారు.

బీర సాగు చేస్తున్న మరో రైతు..

సాయిరెడ్డి అనే రైతు తనకున్న ఒక ఎకరం పొలంలో బీరకాయ పంట సాగు చేస్తున్నారు. పంట వేయడానికి రూ. 20 వేల వరకు ఖర్చయింది. ప్రస్తుతం పంట దిగుబడి రాగా రెండు రోజుల క్రితం 50 కిలోల బీరకాయ పంటను కిలో రూ. 30 ల చొప్పున కామారెడ్డి మార్కెట్ బీట్‌లో అమ్మారు. ఈ పంట కాలవ్యవధి సుమారు 100 రోజుల వరకు ఉంటుంది. పంట పూర్తయ్యేవరకు సుమారు రూ. లక్ష లాభం వచ్చే అవకాశం ఉంది.

మెలకువలు తప్పనిసరి



కూరగాయల పంట రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుంది. మనకున్న పంట భూమిలో కొంత వరి, చెరుకు, కూరగాయాల పంట సాగు చేసుకోవడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు. ముఖ్యంగా కూరగాయల సాగులో మెలకులు పాటిస్తే మంచి దిగుబడి రాబట్టవచ్చు. మార్కెట్లో డిమాండ్ బట్టి కూరగాయల పంటలో రూ.లక్షలు గడించవచ్చు.

–సాయిరెడ్డి, రైతు, బస్వన్నపల్లి

వంతెన నిర్మాణానికి శ్రీకారం



సంగెం రేవు వద్ద సర్వే చేస్తున్న ఇంజినీర్లు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ప్రవహించే గాంధారి వాగుపై సంగెం రేవు వద్ద మరో వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం సంబంధిత ఇంజినీర్లు, సిబ్బంది సర్వే ప్రారంభించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వంతెన నిర్మాణానికి నిధుల మంజూరు కోసం తీవ్రంగా కృషి చేశారని మాజీ సర్పంచ్ సంజీవ్ అన్నారు. వాగు ఆవలి వైపు పొలాలు ఉన్న రైతులు, కొన్ని గ్రామాలకు వెళ్లే ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు తొందరగా ప్రారంభించి వీలైతనంత తొందరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు రూ.30 వేల వేతనం చెల్లించాలి



ఎల్లారెడ్డి: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.30 వేలు చెల్లించాలని జిల్లా మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు రాజేందర్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం చెల్లించడంతో పాటు విధి నిర్వహణలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు చంద్రయ్య, మల్లేష్ తదితరులున్నారు.

రేషన్ షాపు ప్రారంభం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): బస్వాయిపల్లి గ్రామంలో ఆదివారం నూతన రేషన్ షాపును ఏఎంసీ చైర్మన్ దుర్గం శ్యామల ప్రారంభించారు. నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు తర్వాత ప్రజలకు రేషన్‌ను ఇన్‌చార్జి డీలర్ ద్వారా పంపిణీ చేయడంతో ఇబ్బందులకు గురవుతుండటంతో రేషన్ షాపు ఏర్పాటు చేశామని ఆమె అన్నారు. మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, నాయకులు పెర్క శ్రీనివాస్, దుర్గం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రామనామం ఎంతో మధురాతి మధురం



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



చెక్కులను పంపిణీ చేస్తూ..

- భక్తి మార్గంలో యువత ముందుండాలి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): సనాత హైందవ ధర్మాన్ని ఆచరిస్తూ రామనామస్మరణ చేస్తే మధురానుభూతి లభిస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. దైవభక్తిని యువత అలవర్చుకోవాలని సూచించారు. ఆదివారం బ్రాహ్మణపల్లిలోని అంజనాద్రి ఆలయ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హనుమాన్‌చాలీసా పారాయణం, కలశాల ఊరేగింపు, కోలాటాలు, భజన సంకీర్తనలను ఎమ్మెల్యే తిలకించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ..యువత తల్లిదండ్రులను గౌరవిస్తూ..చెడు వ్యసనాలకు బానిస కాకుండా దైవభక్తి మార్గంలో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం ఆలయ నిర్మాణ కర్త పట్లోళ్ల కిషోర్ ఎమ్మెల్యేను సన్మానించి ఏకశిల ఆంజనేయ స్వామి ఫొటోను బహూకరించారు. పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్, నాయకులు రమేశ్ దేశాయ్ తదితరులున్నారు.

నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కల్యాణలక్ష్మి పథకం నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తహసీల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ దశరథ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు శామప్ప పటేల్, మోహన్, సంజీవ్, పండరి, హైమాద్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు మృతి



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎ.దయానంద్ రావు (69) అనారోగ్యంలో ఆదివారం ఉదయం మృతి చెందారు. దయానంద్‌రావు 1989 నుంచి పలు తెలుగు దినపత్రికల్లో విలేకరిగా పనిచేశారు. ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా కొనసాగుతున్నారు. దయానంద్‌రావు మృతి పట్ల డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, గంధ్రాలయ సంస్థ రాష్ట్ర మాజీ చైర్మన్ ఎ.శ్రీధర్, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు వి.రజనీకాంత్, జర్నలిస్టులు సంతాపం తెలిపారు.

ఎట్టకేలకు బీటీ రోడ్డు పనులు పునః ప్రారంభం



బాన్సువాడ రూరల్: బోర్లంక్యాంపు నుంచి బోర్లం గ్రామం వరకు ఏడాది క్రితం ప్రారంభమై నిలిచిన పనులను ఆదివారం పునఃప్రారంభించారు. పూర్తిగా చెడిపోయిన సింగిల్‌రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించి గత ఏడాది కంకర పోశారు. ప్రభుత్వం మారడంతో కొంత కాలం పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కాంట్రాక్టర్‌తో పనులు పునఃప్రారంభించడం హర్షణీయమని గ్రామస్తులు అన్నారు. వారం రోజుల్లో పనులు పూర్తవుతాయని సంబంధిత సిబ్బంది తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ రద్దు కోసం ఏకం కావాలి



సంతోష్‌ను సన్మానిస్తున్న దళిత సంఘం నాయకులు

బాన్సువాడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని దళిత సంఘం నాయకులు, సామాజిక కార్యకర్త అయ్యాల సంతోష్ అన్నారు. ఆదివారం బీర్కూర్ మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త, దళిత సంఘం రాష్ట్ర నాయకులు అయ్యాల సంతోష్‌ను దళిత సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా అంకిత భావంతో పని చేస్తూ, ఏఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ రద్దు కోసం దళితులందరూ కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసముందని అన్నారు. నాయకులు గోవర్ధన్, గంగారాం, బాలకృష్ణ, లక్ష్మణ్, పవన్, పండరి, రవి, సాయిలు తదితరులున్నారు.

దేవునిపల్లి వీడీసీ ఎన్నిక



దేవునిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు



కృష్ణాజీవాడిలో విశ్వబ్రాహ్మణ సంఘం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామాభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గూడెల్లి గంగారాం, ఉపాధ్యక్షులుగా వంగ రాహుల్ కుమార్, నిట్టు లింగారావు, ప్రధాన కార్యదర్శిగా ద్యావరి నవీన్, కోశాధికారిగా నాగల్ల స్వామి(ధోని), సంయుక్త కార్యదర్శిగా చాకలి రమేష్, కార్యవర్గ సభ్యులుగా పెద్దోళ్ల శశిధర్‌రావు, ఒగ్గు నర్సింలు, నవీన్, నరేష్, శ్రీను, బాలమణి, గంగాధర్, సాయిరాం, నీలం లింగం, రాజేందర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పోలీస్ కృష్ణారావు, గ్రామ పెద్దలు నీలం పెద్ద రాజులు, కాసర్ల స్వామి, నిట్టు వెంకట్‌రావు, బోజన్నగారి రాజు పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కమిటీ..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడిలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కమ్మరి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా కమ్మరి స్వామి, కమ్మరి నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా అవుసుల నాగభూషణం, సహాయ కార్యదర్శిగా కమ్మరి శరత్‌కుమార్, కోశాధికారిగా మెడికల్‌రాజు, ఆడిటర్‌గా మోహన్, ప్రచార కార్యదర్శిగా లక్ష్మీ నర్సింలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా మల్లన్న ఆలయ ఉత్సవాలు



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని మల్లన్న దేవాలయం వార్షికోత్సవాలను ఆదివారం కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కామరతి, మల్లన్న ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు. అనంతరం ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కుర్మ సంఘం నాయకులు కుర్మ దస్తయ్య, దశరథ్ తదితరులున్నారు.

బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో బగళాముఖీ అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. రేవంతప్ప, సతీష్, సాయి, మర్మల్ల వెంకటేశం, శివ తదితరులున్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలోని కొచ్చరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు వసతి, నీటి సౌకర్యం కల్పించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తి శ్రద్ధలతో గీతా పారాయణం



కామారెడ్డి అర్బన్: స్థానిక అశోక్‌నగర్ శ్రీకృష్ణ ధ్యాన మందిరంలో గీతా పారాయణం కార్యక్రమం నిర్వహించారు. పారాయణంలో గీతా సాధకులు రఘు, మమత, ఇందిరా, తదితరులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. గీతలోని 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు పూర్తి చేసిన కుషాల్, మనోహర్‌లకు సన్మానం చేశారు.

బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే



దోమకొండ: అంచనూరులో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, పార్టీ నాయకులు నరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జగదీష్, నర్సింలు, బీరయ్య, మల్లయ్య, కిష్టయ్య పోషవ్వ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య వ్యాసాల 'నిశిత' ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కాశీం తదితరులు

కామారెడ్డి అర్బన్: తెరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పట్టణానికి చెందిన తెలుగు అధ్యాపకుడు, కవి, రచయిత వి.శంకర్ రాసిన సాహిత్య వ్యాసాల సంకలనం 'నిశిత'ను ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన తెరసం పదేండ్ల సాహిత్య సభల్లో ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.కాశీం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, తెరసం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, సంపాదకులు బైస దేవదాసు, బిల్లా మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు తాడ్వాయిలో ప్రజావాణి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రహిమొద్దీన్ తెలిపారు. ఈ ప్రజావాణి ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని, ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. ఏమైనా సమస్యలున్నట్లయితే ఈ ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 14 వరకు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగ్గ కేసులను పరిష్కరించనున్నట్లు చెప్పారు. కక్షిదారులు రాజీ చేసుకోదగ్గ కేసులను రాజీ కుదుర్చుకుని పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ ప్రధాన కార్యదర్శి హరీశ్ , ఇతర నాయకులు

కామారెడ్డి టౌన్: గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. వారం రోజులుగా గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని గురుకులాలను సందర్శించి సమస్యల నివేదికను పార్టీకి సమర్పించామన్నారు. జిల్లాలో ప్రధానంగా పౌష్టికాహార లోపం, అపరిశుభ్ర వాతావరణం, తాగునీరు, టాయిలెట్స్, మరుగుదొడ్ల కొరత తదితర సమస్యలున్నాయని వివరించారు. పట్టణ అధ్యక్షుడు చెలిమెల భానుప్రసాద్, నాయకులు పరశురాం గౌడ్, సాయి, రాజేష్, సాకేత్, దీపక్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా రాజు

కామారెడ్డి టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా సోమన్నగారి రాజును ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నర్సింలు, కార్యదర్శిగా రాజేష్, ఉపకార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా సతీష్‌లను ఎన్నుకున్నారు. నూతన సభ్యులను సన్మానించారు.

మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు. పోచమ్మ ఆలయం వరకు రోడ్డును చదును చేశారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, అధ్యక్షుడు దూరిశెట్టి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అభినందన సభ




నస్రుల్లాబాద్(బాన్సువాడ): బస్వాయిపల్లిలో ఆదివారం ఉమ్మడి బీర్కూర్ ఏఎంసీ చైర్‌పర్సన్ దుర్గం శ్యామలకు గ్రామస్తులు అభినందన సభ నిర్వహించారు. డైరెక్టర్లు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల పక్షాన నిలబడి పని చేస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పెర్క శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, డైరెక్టర్లు, గ్రామ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతుంది. శనివారం నాటికి 84 వేల 334 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ



బాన్సువాడ రూరల్: 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బాన్సువాడ మాజీ సర్పంచ్ కొర్ల సంగారెడ్డి కుటుంబ సభ్యులు మృతిచెందిన విషయం తెల్సుకుని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వారి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో బాన్సువాడ మాజీ సర్పంచ్ దివంగత సంగారెడ్డి కుమార్తె లక్ష్మి(50), మనుమడు అక్షయ్(24) మృతిచెందారు. భూమవ్వ, రాజేశ్వర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులకు అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరాతీశారు. నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, ఎర్వాల కృష్ణారెడ్డి, బంధువులు ఉన్నారు.